క్లుప్తంగా

పరామర్శ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా జైలు నుంచి ఇటీవల విడుదలై వచ్చిన వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, వశిష్ట విద్యాసంస్థల చైర్మన్ వల్లకొండ సత్యనారాయణగౌడ్ బుధవారం పరామర్శించారు. గత నెలలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఓ వివాదంలో సమన్వయం కోసం మధ్యవర్తిగా వ్యవహరించిన ప్రభాకర్‌పై అకారణంగా కేసు నమోదు చేసి అరెస్టు చేశారని అన్నారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. శంకర్, సాదు రాంరెడ్డి, షేక్ మౌలానా, వడ్డెర సంఘం జిల్లా నాయకులు టి.శ్రీనివాస్ ఉన్నారు.

ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి

దస్తురాబాద్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలని తహసీల్దార్ లక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని రేవోజీపేట, గోడిసిర్యాల, బుట్టాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వలు ఉండకుండా చూడాలని తెలిపారు. సర్పంచ్ దీటి సుజాత, ఆర్ఐలు గంగన్న, వెంకట నర్సయ్య, సత్యం ఉన్నారు.

చెక్కులు అందజేత

భైంసా: బాసర తహసీల్దార్ కార్యాలయంలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బుధవారం చెక్కులు అందజేశారు. 11 షాదీముబారక్, ఆరు కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో పాటు శ్రీనిధి పథకం కింద మంజూరైన ట్రాక్టర్‌ను అందించారు.

ఆర్థిక సాయం అందజేత

తానూరు: మండలంలోని బోరిగాం జీపీ కార్మికుడు బాలేరావ్ రాము వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.28 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మోహన్‌సింగ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షులు చంద్రకాంత్ ఉన్నారు.

రాజాసింగ్‌ను కలిసిన బీజేపీ నేతలు

ఖానాపూర్: గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పార్టీ అధిష్టానం సస్పెన్షన్ ఎత్తివేయడంతో బుధవారం నియోజకవర్గ బీజేపీ నేతలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పెంబి జెడ్పీటీసీ జాను బాయి, బీజేపీ నియోజకవర్గ నేత రితీష్ రాథోడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల ఉపేందర్ ఉన్నారు.

ఆర్థిక సాయం

నిర్మల్‌రూరల్: మండలంలోని భాగ్యనగర్ గ్రామానికి చెందిన రాచర్ల అడెల్లు అనే వ్యక్తి ఇటీవల దుబాయిలో చనిపోయాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న టీఆర్‌ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల నగదు సాయం అందజేశారు. ఆయన వెంట సయ్యద్ బషీర్ అలీ, నర్సారెడ్డి, కుమ్మరి అశోక్, గంగాధర్ పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని వినతి

సోన్: మండల కేంద్రంలోని మాదపూర్ గ్రామం వద్ద స్వర్ణవాగుపై నిర్మిస్తున్న వంతెన త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ హిమబిందుకు బీజేపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ వినతిపత్రం బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి 2017లో శంకుస్థాపన చేశాడని గుర్తు చేశారు. నాయకులు హరీష్‌రెడ్డి, మార గంగారెడ్డి, హైమద్, ముత్క పల్లి నరేష్, మక్కన్న ఉన్నారు.

పోస్టల్ కొలువుకు గిరిజన యువకుడు


చవాన్ జైసింగ్

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) తండాకు చెందిన లక్ష్మిబాయి–రాజు నాయక్ దంపతుల కుమారుడు చవాన్ జైసింగ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

నిర్మల్‌రూరల్: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై చంద్రమోహన్ హెచ్చరించారు. మండలంలోని అక్కాపూర్ రైతు వేదికలో బుధవారం వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విత్తన డీలర్ల తో సమావేశం నిర్వహించారు. ఏఈఓ రాకేష్ పాల్గొన్నారు.

ముధోల్: కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఏవో భాస్కర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రం ముధోల్‌లోని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు రసీదులు ఇవ్వాలని తెలిపారు.

అన్నదాతకు అండగా..



- రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్న ఏవోలు, ఏఈవోలు
- నిర్మల్ జిల్లాలో 79 రైతు వేదికలు

లక్ష్మణచాంద: పంటల సాగులో అన్నదాతలను ఎప్పటికప్పుడు జాగృతం చేస్తూ తగిన సూచనలు సలహాలు ఇస్తూ మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా రైతులకు వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్, పెట్టుబడి సహాయం అందిస్తుంది. దీనికి తోడు అన్నదాతలు సాగు చేసి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. అలాగే రైతులందరినీ ఒకేచోట చేర్చి వారికి పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికలను ఏర్పాటు చేసింది.

జిల్లాలో 79 రైతు వేదికలు

నిర్మల్ జిల్లాలో మొత్తం 79 రైతువేదికలు ఉన్నాయి. ఇందులో ముధోల్ నియోజకవర్గంలో అత్యధికంగా 42 రైతు వేదికలు, నిర్మల్ నియోజకవర్గంలో 26 రైతు వేదికలు, ఖానాపూర్ నియోజకవర్గంలో 11 రైతు వేదికలు ఉన్నాయి. రైతు వేదికల నిర్మాణంలో అన్నదాతలకు పలు రకాల ప్రయోజనాలు చేకూతున్నాయి.

రైతు వేదికలతో పలు ప్రయోజనాలు....

జిల్లాలో నిర్మించిన రైతు వేదికలతో రైతులకు పలు రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయి.

- ప్రతి క్లస్టర్ పరిధిలోని రైతు వేదికలో ప్రతి రోజు ఏఈవోలు అందుబాటులో ఉంటూ సూచనలు చేస్తున్నారు.
- రైతు వేదికల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి పంట సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.
- పంటలకు తెగుళ్లు సోకినప్పుడు క్లస్టర్ పరిధిలోని ఏఈవో పంటలను నేరుగా సందర్శించి వాటి నివారణకు చేపట్టాల్సిన సూచనలు చేస్తున్నారు.
- రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పిస్తున్నారు.
- పంటలకు తెగుళ్లు సోకినప్పుడు గతంలో రైతులు ఇష్టం వచ్చిన మందులు పిచికారీ చేసేవారు. దీంతో తెగుళ్లు తగ్గకపోగా రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. కానీ రైతు వేదికలు వచ్చిన తరువాత పంటలకు ఏ తెగులు సోకింది. దాని నివారణకు ఏ మందులు వాడాలో ఏవోలు, ఏఈవోలు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నారు



తమ క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు రైతు వేదికలో ఏవో, ఏఈవోలు రైతులకు పంటల సాగుపై, తెగుళ్ల వచ్చినప్పుడు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

– లక్ష్మారెడ్డి, రైతు, న్యూకంజర్

అధికారుల సూచనలతో సాగు



తమ గ్రామానికి ప్రతీ వారంలో రెండు రోజులు ఏఈవో సంతోష్ వచ్చి పంటల సాగుపై, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో వ్యవసాయాధికారులు సూచనల మేరకు పంటలు సాగు చేస్తున్నాం.

– శ్రీనివాస్, రైతు పొట్టపెల్లి (కె)

సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం



తమ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా క్లస్టర్ పరిధిలోని రైతు వేదికల్లో రైతులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పంటల సాగుపై, విత్తనాల, ఎరువుల వినియోగం, తెగుళ్ల సమయంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఏవో, లక్ష్మణచాంద

అందుబాటులో వ్యవసాయాధికారులు



జిల్లాలోని 79 క్లస్టర్ల పరిధిలో ఏవోలు, ఏఈవోలు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. రైతు వేదికల వద్ద రైతులకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తూ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. పంటల సాగులో ఆధునికసాగు పద్ధతులపై, అవగాహన కల్పించి తద్వారా అన్నదాతలు ఆర్థికంగా బలోపేతం కావడానికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

గరంగరంగా సర్వసభ్య సమావేశం

- కరెంట్ ఏఈపై సభ్యుల ఆగ్రహం
- కిందిస్థాయి అధికారులను పంపడంపై మండిపాటు


రాజేశ్‌బాబును సన్మానిస్తున్న సభ్యులు

ముధోల్: ముధోల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో మండలాధ్యక్షురాలు ఆయిషా అఫ్రోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అయేషా సభను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం సభ్యులు విద్యుత్‌శాఖ ఏఈపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మిడిలిపోల్స్, చెడిపోయిన స్తంభాలను తొలగించి కొత్త స్తంభాల ఏర్పాటు, వదులుగా ఉన్న తీగలను సరిచేయాలని, డీడీలు కట్టిన వారికి ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలని ఎన్నిసార్లు ఏఈకి విన్నవించినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ రాకుండా కిందిస్థాయి ఉద్యోగిని సభకు పంపడం ఏమిటని ప్రశ్నించారు. అదే విధంగా వివిధ శాఖ అధికారులు తమ కింది స్థాయి ఉద్యోగులను సమావేశానికి పంపడంపై సభ్యులు ప్రశ్నించారు. సీడీపీవో శ్రీమతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు తినాలని తెలిపారు. రేషన్ షాపుల్లో బియ్యానికి బదులుగా చిరు ధాన్యాలను అందించేలా చర్యలు చేపట్టాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఐకేపీ వివోఏల సమస్యలను పరిష్కరించాలని, ఈ విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సభ్యులు దృష్టికి తీసకువచ్చారు. అనంతరం ఆయా శాఖ అధికారుల నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబును తహసీల్దార్ తుకారం, అధికారులు, నాయకులు సన్మానించారు.

నెల రోజులుగా.. వీవోఏల సమ్మె


మానవహారం నిర్వహిస్తున్న వీవోఏలు

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీవోఏలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ దీక్ష విరమించబోమని వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26,000 అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి సాయన్న, జిల్లా అధ్యక్షుడు జయశీల, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్, నాయకులు రాజు, సంపత్, పరమేష్ స్రవంతి, నవీన్, పోతన్న, గోవింద్, రాందేవ్, గంగాధర్, సునీత, పోశెట్టి, ప్రవీణ్ లావణ్య, ప్రభాకర్, రజిత, గోవింద్ పాల్గొన్నారు.

వీవోఏల సమ్మె

ఖానాపూర్: వీవోఏలు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు బుధవారం 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన వీవోఏలు పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో లావణ్య, రవీందర్, నరేశ్, పల్లవి, నాగరాజు, కవిత ఉన్నారు.

ప్రజాప్రతినిధుల మద్దతు

ముధోల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా ముధోల్‌లో వీవోఏలు నిర్వహిస్తున్న సమ్మెకు బుధవారం ముధోల్ మండల ప్రజాప్రతినిధులు తమ మద్దతు తెలిపారు. వీవోఏల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

ముగిసిన సీఎం కప్ పోటీలు


ఖానాపూర్: బహుమతులతో క్రీడాకారులు


సోన్: బహుమతులు అందిస్తున్న ఎంపీపీ


లోకేశ్వరం: బహుమతులు ఇస్తున్న తహసీల్దార్


భైంసాలో..


మామడలో..


సారంగపూర్‌లో..

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల్లో గెలిచిన విజేతలకు ఎంపీపీ మోహిద్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీవో మల్లేష్, తహసీల్దార్ రాజమోహన్, వైస్ ఎంపీపీ వాల్ సింగ్, ఎస్సై శంకర్, ఎంపీవో చంద్రశేఖర్, క్రీడల ఇన్‌చార్జి పీఈటీ రాముగౌడ్, తదితరులు ఉన్నారు.

క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి

సోన్: మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మానసరెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో ఖలీల్, ఎస్సై సంతోషం రవీందర్ ఉన్నారు.

లోకేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని తహసీల్దార్ సరిత అన్నారు. సర్పంచ్ సౌజన్య, ఎంపీడీవో సల్మాన్‌రాజ్, నాయకులు భోజన్న, ఎంపీటీసీ జయసాగర్‌రావు ఉన్నారు.

భైంసాలో..

భైంసా: బాసర మండలంలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ మేరకు విజేతలకు బహుమతులు అందజేశారు. కబడ్డీలో జాన్‌ప్లేయర్ టీమ్ మొదటిస్థానంలో నిలవగా, బస్సీ టీం రెండోస్థానంలో నిలిచింది. ఖోఖోలో పీజీ బాయ్స్ టీమ్, వాలీబాల్‌లో ముదస్సిన్ టీమ్‌లు విజేతగా నిలిచాయి. అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో ఈశ్వర్, 400 మీటర్ల పరుగుపందెంలో తరుణ్ గెలుపొందారు. విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన క్రీడలు..

మామడ: మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలు ముగిశాయి. ఇందులో ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ ఆరిఫా, ఎస్సై అశోక్, సర్పంచులు హన్మగౌడ్, గంగాధర్ ఉన్నారు.

సారంగపూర్‌లో...

సారంగపూర్: మండలంలో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సుజాత, ఎంపీడీవో సరోజ బహుమతులు ప్రదానం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ సమ్మేళనం జయప్రదం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే బీసీ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేపి ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర వేణి నర్సాగౌడ్ తెలిపారు. 10వేల కార్యకర్తలతో ఏర్పాటు చేసి ఈ సమావేశానికి బీజేపి ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డా.కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ వస్తారన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

భైంసాటౌన్: ఐటీఐ–2023 విద్యాసంవత్సరానికి మొదటి దశ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు ఉపాధి, శిక్షణ విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక సరస్వతీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ బుధవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్‌లలో జూన్ పదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఐటీఐ.తెలంగాణ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కుంటాల: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ తెలిపారు. బుధవారం మండలంలోని కల్లూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ డైరెక్టర్ పసుల లక్ష్మి, నాయకులు చిన్నారెడ్డి, లక్ష్మణ్‌పటేల్, పసుల నవీన్, పెంటవార్ దశరథ్, పురుషోత్తం రజినీకాంత్, నర్సింగ్‌రావు, భోజన్న, దత్తు, నాగభూషణం ఉన్నారు.

నూతన సాగుతో దిగుబడి

ఖానాపూర్: నూతన పద్ధతుల్లో రైతులు పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి ఆసం రవి అన్నారు. బుధవారం మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో అయితం రమేష్ పంటపొలాన్ని పలు గ్రామాల రైతులతో కలిసి క్షేత్ర సందర్శనలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈవోలు మనీష, రాకేష్ పాల్గొన్నారు.

శుభ్రత పాటించాలి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

తానూరు: గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని మురికి కాల్వలను శుభ్రపరిచి క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలన్నారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువులను తయారు చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జలాంసింగ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ వీణ

తానూరు: మండలంలోని బెంబర రైతు వేదిక కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఏడీఏ వీణ రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు విధానం, పంట అమ్మకం, పంటసాగు చేసే రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంటల సాగు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో గణేశ్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, నాయకులు చంద్రకాంత్, ఆయిల్ పాం క్లస్టర్ అధికారి యోగేశ్, ఏఈవోలు నవీన్, విష్ణు, గంగాధర్, రమేశ్ ఉన్నారు.

నిర్మల్ కోర్టు పీపీకి సన్మానం


పీపీని సన్మానిస్తున్న సీఐ, ఎస్సైలు

ఖానాపూర్: జిల్లా కేంద్రంలోని కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రెండో సారి నియమితులైన కలవ్యకుంట్ల వినోద్‌రావును బుధవారం ఖానాపూర్ సీఐ నారాయణనాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలోని చాంబర్‌లో పీపీని సన్మానించారు. బాధితుల పక్షాన వాదించి ఎంతో మంది నిందితులకు శిక్షలు వేయించడంలో పీపీ చేసిన కృషిని సీఐ కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సైలు ఆర్.శంకర్, రజినీకాంత్, న్యాయవాది వెంకట మహేంద్ర ఉన్నారు.

మంత్రితో అమెరికా వెళ్లిన జాన్సన్‌నాయక్


అమెరికాలో మంత్రి కేటీఆర్‌తో జాన్సన్‌నాయక్

ఖానాపూర్: తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అమెరికాలోని బహుళజాతి సంస్థలను ఆహ్వానించేందుకు రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ అమెరికా వెళ్లారు. ఆయనతో పాటు ఖానాపూర్ బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు భుక్యా జాన్సన్‌నాయక్ మంత్రి వెంట వెళ్లారు. ఈ సందర్భంగా సాక్షితో జాన్సన్‌నాయక్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ కృషితో ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పరిశ్రమలు వచ్చాయన్నారు.

సీఎమ్మార్ త్వరగా అందించాలి


గోదాం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

లోకేశ్వరం: మిల్లర్లు సీఎమ్మార్ త్వరగా అందించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మండలంలోని నగర్ గ్రామ శివారు ప్రాంతంలోని గోదాంను బుధవారం పరిశీలించారు. నాణ్యమైన బియ్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత ఉన్నారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో బుధవారం కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ ప్రారంభించారు. కంటి వెలుగు కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పద్మబాయి, వైద్యురాలు అమృతయాణి, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఉన్నారు.